www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024



డిఎస్‌పిచే పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డిఎస్‌పి శ్రీవేద సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలో స్టీమర్ రోడ్డులోని మున్సిపల్ యుపి స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రంలో ఉన్న సదుపాయాలు, ఓటర్ల జాబితా, లైటింగ్ తదితర అంశాలను తనిఖీ చేశారు. డిఎస్‌పి వెంట ఎస్ఐ ముత్యాలరావు, సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీవేద

నీటి సంఘాల పోరుకు..
కౌంట్‌డౌన్..!

5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు
11న డిస్ట్రిబ్యూటరీ, 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
ఏలూరు జిల్లాలో 2,31,311 మంది, పశ్చిమలో 3.29 లక్షల మంది ఓటర్లు
ఎన్నికల ఏర్పాట్లపై ఇరిగేషన్ అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



సాగునీటి సంఘాల ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇక ఎటువంటి ఆటంకాలూ లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే విధంగా ఇరిగేషన్ అధికారులు ముందుకు సాగుతున్నారు. నవంబర్ 21న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను అనూహ్యంగా ఆఖరి నిముషంలో వాయిదా వేశారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల ఐదో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జనరల్‌బాడీ సమావేశాలు ఎక్కడ నిర్వహించేది ప్రకటిస్తారు. ఎన్నికలకు సంబంధించి టాంటాం ద్వారా గ్రామాల్లో తెలియపరుస్తారు. ఎనిమిదో తేదీన వాటర్ యూజర్స్ అసోషియేషన్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ సాగుతోంది. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక సైతం అదే రోజు జరుగుతుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ, 14న ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ దగ్గర పడటంతో జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లలో మునిగి తేలుతున్నారు.

ఎన్నికల ప్రక్రియ జరిగేది ఇలా..

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముగిసేలా అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో మేజర్-92, మైనర్-251, మీడియం-11 మొత్తం 354 వాటర్ యూజర్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ప్రాదేశిక నియోజకవర్గాల్లో మొత్తం 2,31,311 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,53,333 మంది, మహిళా ఓటర్లు 77,978 మంది ఉన్నారు. ఓటర్లయిన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయుఎ) సభ్యులను ఎన్నుకుంటారు. మేజర్, మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలో 12 మంది సభ్యులు ఎన్నికవుతారు. మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్‌లో ఆరుగురు సభ్యులు ఎన్నికవుతారు. ప్రతి కమిటీ నుంచి ఎన్నికైన సభ్యులంతా అందులో ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. యూజర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన వారంతా ఏలూరు జిల్లాలోని 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్లంతా కలిసి తమ్మిలేరు, ఎర్రకాలువ రెండు ప్రాజెక్టు కమిటీలకు సంబంధించిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలు 98, మైనర్ 14 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 14, ప్రాజెక్టు కమిటీ ఒకటి ఉంది. ఈ జిల్లాలో మొత్తం 3.29 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్షా 20 వేల మంది మహిళా ఓటర్లు, పురుష ఓటర్లు 2.09 లక్షల మంది ఉన్నారు. వీరంతా వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలను ఎన్నుకుంటారు. వారు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఓటర్లు చేతులెత్తే ప్రక్రియ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడైనా గందరగోళం ఏర్పడి ఎన్నిక జరగకపోతే ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకు సాగుతారు.

కూటమిలో పదవుల పంపకం పూర్తి

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే కూటమిలో పదవుల పంపకం పూర్తయ్యిందని చెప్పొచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి సంఘాలు, సహకార సంఘాల పదవులపై గ్రామాల్లో ఒక ఒప్పందానికి వచ్చిన పరిస్థితి ఉంది. దీంతో అనధికారికంగా నీటిసంఘాల కమిటీలకు సంబంధించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులతోపాటు, సభ్యుల ఎంపిక జరిగిపోయింది. ఇప్పుడు అదే నాయకులు ఎన్నికల్లో పోటీ చేసి పదవులు చేపట్టనున్నారు. వైసిపి నుంచి ఈ పోటీలో పాల్గొనేందుకు నాయకులు ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి జిల్లా నాయకత్వం సైతం సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించని పరిస్థితి ఉంది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ అంతా లాంఛనప్రాయంగానే సాగనుంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- 5వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ, అదేరోజు జనరల్ బాడీ సమావేశాలు ఎక్కడ నిర్ణయించేది ప్రకటన, గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి టాం.. టాం
- 8వ తేదీ ఎన్నికల ప్రక్రియ. అదేరోజు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక
- 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు
- 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

ఏలూరు జిల్లా వివరాలు..

మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్లు-92
మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్లు-11
మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్లు-251
డిస్ట్రిబ్యూటరీ కమిటీలు-14
ప్రాజెక్టు కమిటీలు-2
ఓటర్లు మొత్తం-2,31,311 మంది
పురుష ఓటర్లు-1,53,333
మహిళా ఓటర్లు-77,978

7న జిల్లా యువ ఉత్సవ్

నరసాపురంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు
యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలి
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల ఏడో తేదీన నరసాపురంలో జిల్లా యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో ఈ నెల 7న నరసాపురం వైఎన్ కాలేజీలో నిర్వహించనున్న జిల్లా యువ ఉత్సవ్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువ ఉత్సవ్‌లో భాగంగా ఇండియా @ 2047 అనే అంశంపై స్పీచ్, చిత్రలేఖనం, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాల్లో వ్యక్తిగత పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీల్లో (గ్రూప్, వ్యక్తిగత పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లాస్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయికి పంపుతారన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. జిల్లాలోని యువత ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ నిరూపించుకోవాలని, అలాగే యువ ఉత్సవ్‌లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యువ ఉత్సవ్‌లో తమ పేర్లను https://forms.gle/ yQ2miKgqnNc7fRoq లింక్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9989316106 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఎంఎస్ఎంఇ సర్వేను పూర్తి చేయాలి: కలెక్టర్

జిల్లాలోని వ్యాపార వినియోగ విద్యుత్ కనెక్షన్లు ఎంఎస్ఎంఇసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆమె జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ సర్వేకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ పారిశ్రామికవేత్తలు ఎంఎస్ఎంఇ సర్వేను పూర్తిగా సహకరించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు బ్యాంకు ఖాతాలకు 87 శాతం ఎన్‌పిసిఐ అనుసంధానం జరిగిందన్నారు. అయితే అత్తిలి, ఆకివీడు, యలమంచిలి, పోడూరు, తాడేపల్లిగూడెం మండలాల్లో ఎన్‌పిసిఐ పురోగతిని పెంచాలన్నారు. హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్‌లో ఆకివీడు, పోడూరు, గణపవరం, నరసాపురం, పెంటపాడు మండలాలు, భీమవరం, తాడేపల్లిగూడెం మున్సిపాల్టీలు వెనుకబడ్డాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శ్రీపతి పాల్గొన్నారు.

సంతృప్తి చెందేలా అర్జీలు పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలకు చక్కని పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 102 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారానికి మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. ప్రతి అర్జీనీ సంబంధిత అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని ఎండార్స్‌మెంటు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్. అప్పారావు, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలు వింటున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

20, 21, 22 తేదీల్లో భీమవరంలో.. సిపిఎం జిల్లా మహాసభ

విచ్చేయనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర నేతలు
20న భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ
మహాసభను జయప్రదం చేయాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

పోరాటాల పురిటిగడ్డ భీమవరంలో ఈ నెల 20, 21, 22వ తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు సందర్భంగా భీమవరం పట్టణంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించనున్నామని, తర్వాత భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. మహాసభకు ఎంపికైన ప్రతినిధులతోపాటు హాజరయ్యే ప్రజానీకం వేలాదిమందితో అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించనున్నామన్నారు. 21, 22 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా సిపిఎం జాతీయ నేతలతోపాటు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరు కానున్నట్లు తెలిపారు. స్థానిక మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బలరాం మాట్లాడారు. గత మూడేళ్లలో ప్రజా సమస్యలపై చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్తులో చేపట్టే ప్రజా పోరాటాల సన్నద్ధతకు రూపకల్పన ఈ మహాసభ ముఖ్యోద్దేశమన్నారు. ఫిబ్రవరిలో నెల్లూరులో రాష్ట్ర మహాసభ, ఏప్రిల్ మొదటి వారంలో అఖిలభారత మహాసభ తమిళనాడులోని మధురైలో జరుగుతాయని తెలిపారు. అల్లూరి స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రధాన కోరికగా మహాసభ జరుగుతుందన్నారు.

మూడేళ్లలో పెద్దఎత్తున ఉద్యమాలు

జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై సిపిఎం పెద్దఎత్తున ఉద్యమాలు చేసిందన్నారు. జిల్లాలో కాలుష్యానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిందన్నారు. రైతు, పేదరైతు, కౌలు రైతుల సమస్యలపై ఉద్యమించామన్నారు. జిల్లాలో ఆక్వా నుంచి ఆదాయం పొందే ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలను గాలికొదిలేశాయని, సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని, విద్యుత్ రాయితీలను కొనసాగించాలని తదితర సమస్యలపై పోరాడామన్నారు. పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు అందించకపోవడంతో లబ్ధిదారులు అప్పుల పాలై, వడ్డీలు కట్టే పరిస్థితిలో లేరని, అంతేకాక సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఉండే పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వేలాదిమందితో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించామన్నారు. వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు చేయకపోవడంపై ఆందోళన చేశామన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసరాలు, ఔషధ ధరలు, ఎరువులు, పురుగుమందులు, కూరగాయల ధరల పెరుగుదలను నిరసిస్తూ పోరాడమన్నారు. రోడ్లు నిర్మించాలని, మరమ్మతులు చేయాలని దఫదఫాలుగా దీక్షలు, ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు చేసిన ఘనత జిల్లాలో సిపిఎంకు ఉందన్నారు. చేతి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించామన్నారు. నూతన మద్యం పాలసీ పేరుతో నివాస ప్రాంతాల మధ్య, బడి, గుడి వంటి ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహించడంపై మహిళా సంఘాలతో కలిసి ఆందోళనలు చేశామన్నారు. దళితపేటల్లో స్కూళ్ల మూసివేత, డిఎస్‌సి, ఉపాధి కోసం పోరాటాలు చేశామని వివరించారు. జిల్లాలో ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, ర్యాంపుల్లో బంటా కార్మికులు ఉపాధి కోసం ఇసుక సమస్యపై ఉద్యమించామని తెలిపారు. ఆకివీడులో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పెరిగిన రౌడీయిజంపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించామన్నారు. దళితులకు శ్మశాన వాటికలు, భీమవరంలో డంపింగ్ యార్డ్‌పై ఆందోళనలు చేపట్టామన్నారు. ఉండిలోని ఫ్లయ్ ఓవర్ నిర్మాణాన్ని గాలికొదిలేశారని, ఉండి రోడ్డు, శృంగవృక్షం, కుముదవల్లి ప్రాంతాల్లో రైల్వేగేట్లు వద్ద అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తామని కనీసం పట్టించుకోవట్లేదని, వాటిపై కేంద్రీకరించి సిపిఎం ఉద్యమిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లావ్యాప్తంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, చేతి వృత్తిదారులు, దళితులు, పేదలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున ఉద్యమించేలా ఈ మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తికి బిటిఎ మద్దతు

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - భీమవరం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) జిల్లా అధ్యక్షులు కేశనకుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ గంజి మధుసూదనరావు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులుగా ఉపాధ్యాయ ఉద్యమ ప్రతినిధికి మద్దతు ఇవ్వడం తమ బాధ్యతని తెలిపారు. జిల్లాలోని బిటిఎ సభ్యులు, సానుభూతిపరులు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ మాజీ ఛైర్మన్ నారాయణమూర్తి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ మాజీ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి (71) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య కోవిడ్ సమయంలో మృతి చెందారు. నారాయణమూర్తి గతంలో టిడిపి పట్టణాధ్యక్షులుగా పని చేశారు. మాజీ ఎంఎల్‌ఎలు అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ బాబ్జీ హయాంలో నియోజకవర్గంలో కీలకంగా పని చేశారు. విఎన్‌ఎం ట్రాన్స్‌పోర్ట్ ముఖ్య భాగస్వామిగా ఉన్నారు. 2014-19 మధ్యకాలంలో మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేశారు. ఆదివారం జరిగిన కాపు వనసమారాధనలో చురుగ్గా గడిపిన నారాయణమూర్తి హఠాన్మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన భౌతికకాయాన్ని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, నేతలు పెచ్చెట్టి బాబు, జివి, వైసిపి నేత యడ్ల తాతాజీ తదితరులు సందర్శించి పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్‌ఎలు డాక్టర్ బాబ్జీ, అల్లు వెంకట సత్యనారాయణ, బంగారు ఉషారాణి, మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు, లయన్స్ మాజీ జోనల్ ఛైర్మన్ పిఎన్‌వి.వరప్రసాద్ నారాయణమూర్తి మృతి పట్ల సంతాపం తెలిపారు



నారాయణమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన మంత్రి రామానాయుడు

విధుల్లోకి తీసుకుని వేతన బకాయిలివ్వండి

కలెక్టరేట్ వద్ద వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ, వార్డు వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎపి గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద వాలంటీర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు బాలాజీ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు. వాలంటీర్లు చేస్తున్న పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. గత ప్రభుత్వం వలంటీర్లను అన్ని రకాలుగా ఉపయోగించుకుందని గుర్తు చేశారు. ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి వాలంటీర్లు వారధిగా పని చేశారన్నారు. కూటమి కూడా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వేతనం రూ.10 వేలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే కూటమి అధికారంలోకొచ్చాక వాలంటీర్ల సమస్యలపై కనీసం పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. వాలంటీర్లకు వేతన బకాయలు కూడా ఉన్నాయని, వాటిని విడుదల చేయడంతోపాటు తక్షణమే వారిని విధుల్లోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో శేఖర్, సుమ, బాలకృష్ణ, సాయి, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు

భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయాలి

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల

వసతి గృహ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యార్థి దశ నుండే చక్కగా దిశా నిర్దేశం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వసతిగృహ సంక్షేమాధికారులకు సూచించారు. సోమవారం రాత్రి స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఏయే తరగతుల విద్యార్థులు చదువుకుంటున్నారు, స్కూల్ అనంతరం వసతి గృహంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా, పదో తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారు, విద్యార్థులకు మెడికల్ చెకప్‌లు జరుగుతున్నాయా, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని డార్మెటరీలను పరిశీలించారు. ముఖ్యంగా టాయిలెట్లు సముదాయాన్ని స్వయంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. డార్మెటరీలో చదువుకుంటున్న విద్యార్థులను పలకరించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. భోజనం ఎలా ఉంది, సౌకర్యాలు బాగున్నాయా, ఎలా చదువుతున్నారు, భవిష్యత్తులో ఏం చదవాలి అనుకుంటున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి ఆహార పదార్థాల రుచి చూశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎ.శ్రీకాంత్, తహశీల్దార్ జి.సుందర్‌సింగ్, ఆర్‌ఐ కె.లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.




హాస్టల్లో భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వెబ్‌సైట్

ప్రారంభించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో ప్రజల సమస్యలకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే వెబ్‌సైట్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. స్థానిక క్లాత్ అండ్ యారన్ మర్చంట్స్ సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి పలు సమస్యలను తీసుకొస్తున్నారన్నారు. వీటిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పరిష్కారమైన ప్రతి సమస్య ప్రజలకు తెలిసేలా వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను వెబ్‌సైట్‌లో పొందుపరిచి సంబంధిత శాఖలకు పంపిస్తామని రామానాయుడు చెప్పారు. దీనికి సంబంధించి ప్రతి కార్యాలయంలో నోడల్ అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించిన తర్వాత సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తారన్నారు.



వెబ్ సైట్ ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

బానిసత్వ నిర్మూలన సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బానిసత్వ నిర్మూలన సామాజిక బాధ్యత అని, బ్రిటీష్ వారి కాలంలో భారతీయులను బానిసలుగా చూసేవారని, మనిషిని మనిషిగా గౌరవించుకోవాలని న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు అన్నారు. సోమవారం డిఎన్ఆర్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, లా కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ బానిసత్వ నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. లా కళాశాల సీనియర్ అధ్యాపకులు భాస్కరరావు, సిహెచ్ వీర్రాజు, కె.రత్నకుమారి, ఎం.స్వాతి, ఎం.కిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సురేష్‌కు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విజ్ఞానవంతులు, మృదుభాషి గాదె సురేష్ అని, ఎన్నో ఉద్యోగాలు చేసినా ఎంతో బాధ్యతగా వృత్తి బాధ్యతలను నిర్వర్తించారని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, బొండాడ బంగారు రాజు, బొండా హనుమంతరావు, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం హైదరాబాద్ విజయ బ్యాంకులో మేనేజర్ గా చేస్తూ రిటైర్డ్ అయ్యి భీమవరం వచ్చిన గాదె సురేష్‌ను మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో సురేష్ ఎంఎల్‌కు పార్ట్ టైం ఉద్యోగిగా చేసి విజయ బ్యాంకులో మేనేజర్‌గా పని చేశారని, ఆయన చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. సురేష్ మాట్లాడుతూ మార్నింగ్ కాఫీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి విన్నానని తెలిపారు. అనంతరం సురేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కనగర్ల రామకృష్ణ, కంచర్ల భాస్కరరావు, తటవర్తి నారాయణ, కోట్ల నాని, బొండాడ సుబ్బారావు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కాలుష్యంతో అంతుపట్టని వ్యాధులు వస్తున్నాయని, కాలుష్య నివారణ ప్రజలందరి సామాజిక బాధ్యత అని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక, ఏకో క్లబ్, పురపాలక సంఘం ఆధ్వర్యంలో జాతీయ వాతావరణ కాలుష్య నివారణ దినోత్సవం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భావితరాలను రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు పాటు పడాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం కె.వెంకటరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో కె.గోపీనాథ్, వార్డు సెక్రటరీలు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

అనర్హులకు రేషన్ కార్డులు తొలగించండి

ప్రజాశక్తి - ఉండి

అనర్హులకు రేషన్ కార్డులు తొలగించాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పారదర్శకంగా పరిశీలించి రేషన్ కార్డులు ఇవ్వకుండా తమ అనుయాయులకు, పంట పొలాలు, వ్యాపార సంస్థలు ఉన్నవారికి, ఉద్యోగులకు రేషన్ కార్డులను ఇష్టారీతిన జారీ చేశారని విమర్శించారు. అందులో సుమారు 50 శాతం కార్డులు రేషన్ బియ్యం రేషన్ షాపుల ద్వారా, కిరాణా షాపుల ద్వారా, ఆటోల ద్వారా కిలో 15 రూపాయలకు కొనుగోలు చేసి రైస్ మిల్లుల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందని, దీన్ని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన అనర్హులకు రేషన్ కార్డులు తొలగింపు చర్యలు చేపట్టి అర్హులకు మాత్రమే ఇవ్వాలని కోరారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

గణేష్ భవాని ఏకగ్రీవం

ప్రజాశక్తి - పాలకొల్లు


గణేష్ భవానీని అభినందిస్తున్న సహచరులు

జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 2వ సారి పాలకొల్లుకు చెందిన ముద్దాడ గణేష్ భవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా 2వ సారి పాలకొల్లుకు చెందిన ముద్దాడ గణేష్ భవానీని నియమించినట్లు జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య లేఖ ద్వారా ప్రకటించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెలగణ నూకనమ్మ, రాష్ట్ర కన్వీనర్, ఇన్‌ఛార్జి బోను దుర్గా నరేష్‌కు గణేష్ భవాని ధన్యవాదాలు తెలిపారు. బిసి సంక్షేమం కోసం తాను కృషి చేస్తానని తెలిపారు.

4 నుంచి ఎస్ఆర్‌కెఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు 'అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఐసిఎఎఎఐ-2024) పేరిట జరుగుతుందని సిఎస్ఇ హెడ్, అంతర్జాతీయ సదస్సు జనరల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బిహెచ్‌వి ఎస్.రామకృష్ణంరాజు, డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ప్రముఖుల వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. అంతర్జాతీయ సదస్సు రెండోది తమ కళాశాలలో జరగడంపై సంతోషం వ్యక్తం చేశారు. మలేషియా నుంచి డాక్టర్ జరీనా మహ్మద్ అనాపి, దుబాయ్ నుండి రోబోటెక్ ఎక్స్ ల్యాబ్ వ్యవస్థాపకులు జూది ప్రస్టియో, అమెరికాలోని ఒరాకిల్ కార్పొరేట్‌కు చెందిన డాక్టర్ బుద్ధరాజు రాజారావు, టెక్సాస్ నుండి ప్రకాష్ మురుగేషన్, ఐఐటి హైదరాబాద్ నుండి ఎంవి. పాండురంగారావు, ఎన్ఐటి రాయపూర్ నుండి డాక్టర్ ప్రదీప్‌సింగ్, ఎన్ఐటి వరంగల్ నుండి డాక్టర్ కెవి.కాదంబరి వంటి ప్రముఖులు సదస్సులో మాట్లాడనున్నారని తెలిపారు. కార్యక్రమానికి డాక్టర్ ఆర్ఎన్‌వి.జగన్మోహన్ కన్వీనర్‌గా, టివికెపి.ప్రసాద్ కోకన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సదస్సుకు విదేశాల నుండే కాకుండా దేశంలో ఐఐటిలు, ఎన్ఐటిల నుండి పలువురు నిపుణులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

గుండెపోటుతో శానిటరీ మేస్త్రీ మృతి

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మృత్యుంజయ కాలనీకి చెందిన శానిటరీ మేస్త్రి సోమయోధుల పెద పెద్దిరాజు (50) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన ఆచంట పంచాయతీలో 20 సంవత్సరాలుగా శానిటరీ మేస్త్రిగా పనిచేస్తూ అందరి మన్ననలూ పొందారు. వశిష్ట గోదావరి కోడేరులో పెద పెద్దిరాజు అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సెక్రటరీ నరసింహారావు, టిడిపి నాయకులు గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, కేతా మీరయ్య, జనసేన నాయకులు నంబూరు విజయ్, సిపిఎం నాయకులు పి.మోహన్‌రావు, కుసుమ జయరాజు, తలపూరి బుల్లబ్బాయి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు


ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని భట్లమగుటూరు వద్ద సోమవారం కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న పాలకొల్లుకు చెందిన సిర్ర అఖిల్ (17)కు ఎడమ కాలు, కుడి చేయి విరగడంతో స్థానికులు పెనుమంట్ర 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. ఈ మేరకు 108 వాహనంలో సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన చికిత్స కోసం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సేవే ఆయన లక్ష్యం..

సమాజ సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ నిరీక్షణ రాజు

ప్రజాశక్తి - కాళ్ల


నిరీక్షణ రాజు సత్కరిస్తున్న సభ్యులు

సొంత లాభం కొంత మానుకో, పొరుగు వాడికి తోడుపడవోయ్ అన్న గురజాడ మాటలను ఆయన వంట పట్టించుకున్నారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పలు కష్టాలు అనుభవించి ఉన్నతస్థాయిలో స్థిరపడినా ఆలోచనల వేగం సేవాబాటను వీడలేదు. తన పని తాను చేసుకొని హాయిగా కుటుంబంతో గుడుపుతూ ఆస్తులు పెంచుకుంటున్న ప్రస్తుత రోజుల్లో కొందరు మాత్రమే నిస్వార్థంగా నలుగురికి సాయం చేస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటారు. ఆ కోవకు చెందిన వారే డాక్టర్ నిరీక్షణ రాజు. ఆయన ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగి సమాజ సేవకుడిగా, అంబేద్కర్‌వాదిగా, టిడిపి నేతగా లేబర్ కాంట్రాక్టర్‌గా రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదిగారు. సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మదిలో నిలిచారు.


కోపల్లెలో చర్చి నిర్మాణ పనుల్లో పాల్గొన్న నిరీక్షణరాజు

కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ డి.నిరీక్షణరాజు స్వతహాగా మృధు స్వభావి. ఆక్వారంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడం ఆయన సంకల్పం. 16 ఏళ్లుగా ఆక్వారంగంలో రాణిస్తున్నారు. విద్య, సాహిత్య, సాంస్కృతిక, కళ, ఆధ్యాత్మిక, సామాజిక చైతన్య రంగాల్లో అందిస్తున్న నిరుపమాన సేవలు బహు ప్రశంసనీయం. ప్రతి ఒక్కరూ నిరీక్షణరాజును ఆదర్శంగా తీసుకోవాలి.

కరోనాతో పలు సేవలు..

కరోనా సమయంలో ఇబ్బందులు పడుతున్న ఆక్వా కార్మికులకు నిత్యావసర సరుకులు అందించారు. సాయం కోసం వెళ్లే ప్రతి ఒక్కరికీ కాదనకుండా అండగా నిలబడ్డారు. కరోనా సమయంలో అన్ని వర్గాల ప్రజలకూ అన్నదాన వితరణతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి అన్నార్థులకు ఆపన్న హస్తం అందించారు. డాక్టర్ నిరీక్షణ రాజు సమాజంలో పేదవారికి తనవంతు సహకారం అందిస్తున్నారు. ఆక్వా కార్మికులకు, పేదలకు తన వంతు సాయం చేస్తున్నారు. మానవతా దృక్పథంతో ఆయన చేసిన సేవలకు గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు.

తన సంపాదనలో సమాజ సేవ..

డాక్టర్ నిరీక్షణరాజు తన సంపాదనలో కొంత సొమ్మును సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు వినియోగిస్తున్నారు. ఆక్వా రంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా స్థిరపడి 16 ఏళ్లుగా కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందిస్తున్నారన్నారు.

డాక్టరేట్ అవార్డు..

ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే వందల మంది కార్మికులకు కరోనా మొదటి, రెండు దశల్లో రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలు ప్రతి సంవత్సరమూ నిర్వహిస్తూ పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. నిరీక్షణరాజు చేస్తున్న సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డు వరించింది.

నిరీక్షణ రాజు అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోపల్లె గ్రామంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలను ఏటా నిర్వహిస్తున్నారు. పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు 2022లో ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. పలు వేదికల్లో నిరీక్షణరాజును ఘనంగా సత్కరించారు.

నిర్విరామ సమాజ సేవే లక్ష్యం..

డాక్టర్ డి.నిరీక్షణ రాజు, కోపల్లె



సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాల్గొనాలి. సంపాదించిన దాంట్లో కొంత సొమ్ము సామాజిక సేవకు నిరంతరం వెచ్చించాలన్నదే నా ఆకాంక్ష. భీమవరం, ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఆక్వా కార్మికులకు, పేదలకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను. కోపల్లె గ్రామంలో నూతన చర్చి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నానన్నారు.


పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు నాగరాజు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాళ్లకూరుకు చెందిన మట్టా రామారావు (70) ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. అతని మట్టి ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మత్స నాగరాజు సోమవారం అందజేశారు.


క్షీరా రామలింగేశ్వరస్వామి సన్నిధిలో సిఎం పిఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి పిఎ ప్రద్యుమ్న పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు.

వాండ్రం సర్పంచికి టిడిపి శాశ్వత సభ్యత్వం

ప్రజాశక్తి - ఉండి


శాశ్వత సభ్యత్వం తీసుకున్న దాసరి వెంకటకృష్ణ

వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణంరాజు సమక్షంలో రూ.లక్షతో సోమవారం సాయంత్రం టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో భాగంగా వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. దేశ చరిత్రలో మొట్ట మొదటిసారిగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కార్యకర్తల కోసం ప్రమాద బీమాను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్తా టిడిపి సభ్యత్వం పొందడం ద్వారా తమ కుటుంబీకులకు భరోసా ఇచ్చిన వారవుతారన్నారు. రఘురామ కృష్ణంరాజు చేసే అభివృద్ధి పనులకు ఆకర్షితులైన చాలా మంది నాయకులు టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని పొందేందుకు తహతహలాడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో అత్యధిక శాశ్వత సభ్యత్వాలు తీసుకున్న నియోజకవర్గంగా ఉండి నియోజకవర్గం స్థానం సంపాదించిందని, ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు సూచనల మేరకు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పలు చోట్ల ఎక్సైజ్ దాడులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సోమవారం ఎక్సైజ్ పోలీసులు మెరుపుదాడులు చేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. నరసాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బెల్ట్ షాపులు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ దారులు అనధికారికంగా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించే ప్రయత్నం చేస్తే వారి లైసెన్సును రద్దు చేస్తామన్నారు. తీరంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కెపిపాలెం, మంగళగుంటపాలెం, మోళ్లపర్రు, చినమామిడిపల్లి గ్రామాల్లో దాడులు చేశామన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా విస్తృత దాడులు చేస్తామన్నారు. ఎక్కడా బెల్ట్‌షాపులు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ప్రసాద్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో సిఐలు రాంబాబు, కళ్యాణచక్రవర్తి, ఎస్ఐ కాశీం, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆర్‌డిఒ దాసి రాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 ఫిర్యాదులను అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.1,600 ఇవ్వాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పోడూరు


ధాన్యం రాశులను పరిశీలిస్తున్న నేతలు

మండలాల్లో ఇటీవల ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రాల్లో 75 కేజీల బస్తాకు రూ.1,725 ఇస్తానన్న ప్రభుత్వం ఇప్పుడు అదే బస్తాకు రూ.1,430 ఇస్తోందని, కనీస మద్దతు ధర రూ.1,600 ఇవ్వాలని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోడూరు, జగన్నాథపురం తదితర గ్రామాల్లో సిపిఎం బృందం సోమవారం ధాన్యం కల్లాలో పర్యటించి గిట్టుబాటు ధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు అల్లాడుతున్నారన్నారు. ఇది ఆసరాగా తీసుకుని దాళారులు 75 కేజీలకు రూ.1,430 ఇచ్చి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఎకరాకు రూ.10 నుండి 15 వేల రూపాయలు నష్టపోతున్నారని వాపోయారు. అప్పుడే కోసిన ధాన్యానికి కనీస ధర రూ.1,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యటించిన వారిలో పిల్లి ప్రసాద్, బొంతు శ్రీను ఉన్నారు.

మానేసిన విద్యార్థులను కాలేజీకి పంపాలి

ప్రజాశక్తి - గణపవరం

కాలేజీ బయట ఉన్న విద్యార్థునులను మరలా కాలేజీకి పంపించి వారిని విద్యావంతులుగా తయారు చేయడం తల్లిదండ్రుల బాధ్యత అని గణపవరం డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు అన్నారు. సోమవారం గణపవరం, సరిపల్లి, గ్రామాల్లో హైస్కూలు, కాలేజీ నుంచి డ్రాప్ అవుట్ అయిన బాలికలకు చెందిన తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కల్పించారు. ఎంత కష్టమైనా ఉన్నత విద్యనభ్యసిస్తే వారి భవిష్యత్ బాగుటుందన్నారు. కార్యక్రమంలో కె.స్వరూపరాణి, టి.అక్కిరాజు, శ్రీనివాస్‌రావు, జివి శారదాదేవి, జి.వెంకటరమణ, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

రామకృష్ణ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చిట్టవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఆకన రామకృష్ణ దంపతులను మంగళవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విద్యార్థులు ఉత్తమ విద్యాబోధన చేస్తున్న రామకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం సముచితమని గ్రామ సర్పంచి తాడి లక్ష్మణరావు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బొక్కా నాగరాజు, గ్రామస్తులు పోలిశెట్టి సత్తిబాబు, గ్రంధి శ్రీనివాస్. పాఠశాల హెచ్ఎం గుబ్బల వెంకట స్వామి పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఏరియా ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని గౌరవాధ్యక్షులు డిబివి సుబ్రహ్మణ్యం, జి.డేవిడ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వంకాయల రవికుమార్, కార్యదర్శిగా బి.మురళి, ఉపాధ్యక్షులుగా వి.విశ్వనాథం, సహాయ కార్యదర్శిగా పి.సురేంద్ర, కోశాధికారిగా కె.రామారావు, సభ్యులుగా బి.విజయ్, సిహెచ్ బి.సత్యనారాయణ, జి.లక్ష్మణ్, లక్కు సత్తిబాబు, కొత్తపల్లి రాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా అభినందించారు.

సండే స్కూలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

మండలంలోని కొప్పర్రు, పెదపేటలో సోమవారం పెంతెకొస్తు పరిశుద్ధ సంఘం వారితో సండే స్కూల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నరసాపురం జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ సంఘం వారి ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. శ్రీనివాస్ పిల్లలకు వాటర్ బాటిల్స్, గిఫ్టులు అందించారు. అనంతరం సంఘం సభ్యులు పోలిశెట్టి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరించారు.

నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

11 అర్జీల స్వీకరణ : జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్‌పి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతిస్తూ అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుండి ఎస్‌పి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 11 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి తక్షణమే విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరైన్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ఆరు మెరైన్ ఫిషర్మెన్ కోపరేటివ్ సంఘాలకు సోమవారం ఎన్నికల నిర్వహించామని ఎఫ్‌డిఒ కె.వివేక్ తెలిపారు. పాతపాడు, కాళీపట్నం పడమర, కొత్తొట, ముత్యాలపల్లి, పేరుపాలెం సౌత్ -1, పేరుపాలెం, దిబ్బల పల్లెపాలెంలో మ్యారేజ్ ఫిషర్మెన్ కోపరేటివ్ సంఘాలకు ఎన్నికలు నిర్వహించామని తెలిపారు.